

విద్యార్థులతో కలిసి అల్పాహారం తీసుకుంటున్న డీఈవో రామారావు

## 'సీఎం అల్పాహారం'లో మెనూ పాటించాలి

కేసముద్రం, అక్టోబర్ 7: ముఖ్యమంత్రి అల్పాహారంలో తప్పకుండా మెనూ పాటించాలని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మండలంలోని తాళ్లపూసపల్లి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారాన్ని శనివారం డీఈవో పరిశీలించి మాట్లాడారు. విద్యార్థులు ఆకలితో తరగతి గదిలో ఉండకూడదనే సంకల్పంతో ప్రభుత్వం అల్పాహార కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. అల్పాహారంలో నాణ్యత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రమాదేవి, డీఆర్డీఏ పీడీ సన్యాసయ్య, సీడీపీవో డెబోరా, కో ఆర్డినేటర్ చంద్రశేఖర్, నోడల్ హెచ్ఎం కొత్త జగన్ మోహన్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయులు కనకయ్య, కార్యదర్శి దర్గయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు.

**'అల్పాహారం' పకడ్బందీగా నిర్వహించాలి**

మరిపెడ: గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు సీఎం అల్పాహారం పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని తహసీల్దార్ సైదులు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ పాఠశాలలో కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మరిపెడ: కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ సైదులు

## జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలు

గార్ల, అక్టోబర్ 7: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. 2022-2023 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు షీల్డ్, నగదు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ గోవిందరావు మాట్లాడుతూ.. క్రమ శిక్షణతో కూడిన విద్యనభ్యసించి, మంచి మార్కులు సాధించారన్నారు. పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిటైర్డ్ అధ్యాపకుడు యడ్ల అప్పారావు, అధ్యాపకులు రఘుబాబు, జోగ్యా నాయక్, ప్రసాదరావు, రవీందర్, సోమన్న, సత్యనారాయణ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి నగదు అందజేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందరావు

## కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న కేంద్రం

మహబూబాబాద్ రూరల్, అక్టోబర్ 7: దేశంలోని కార్పొరేట్ సంస్థలైన పెట్టుబడీదారులకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తున్నదని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. శనివారం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఈనెల 12, 13న జిల్లాలో నిర్వహించనున్న పీవైఎల్ మహాసభల పోస్టర్ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. దేశంలో నిరుద్యోగ సమస్య తీవ్రంగా వెంటాడుతున్నదని, మోదీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి, ఈ 9 సంవత్సరాల కాలంలో రెండు కోట్ల ఉద్యోగాలను ఊడగొట్టారని ఎద్దేవ చేశారు. దేశంలో నిరుపేదలకు, కార్మిక కర్షకులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అందరు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. పీవైఎల్ 8వ మహాసభలను విజయ వంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కేఎస్ ప్రదీప్, కొత్తపల్లి రవి, ఎం అన్వేష వీరన్న, శ్రీనివాస్, యాకయ్య పాల్గొన్నారు.




మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పీవైఎల్ నాయకులు

# గిరిజన సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- *వారి అభివృద్ధికి రూ.6వేల కోట్లు ఖర్చు చేసిన సీఎం కేసీఆర్*
- *గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్*
- *పెద్ద తండాలో రూ. 181 కోట్ల పనులకు శంకుస్థాపన*
- *పాల్గొన్న ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, కలెక్టర్ శశాంక*



అభివృద్ధి పనుల శంకుస్థాపన శిలాఫలకాలను ఆవిష్కరిస్తున్న మంత్రి సత్యవతిరాథోడ్, చిత్రంలో ఎంపీ కవిత, ఎమ్మెల్సీ రవీందర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, కలెక్టర్ శశాంక

కురవి, అక్టోబర్ 7: గిరిజనుల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని, వారి అభివృద్ధికోసం సీఎం కేసీఆర్ రూ.6వేల కోట్లు ఖర్చు చేశారని గిరిజన, స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మండలంలోని పెద్దతండా గ్రామంలో శనివారం ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, జడ్పీ చైర్‌పర్సన్ ఆంగోత్ బిందు, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్రావు, కలెక్టర్ శశాంకతో కలిసి గిరిజన సంక్షేమ శాఖ నిధుల నుంచి సుమారు రూ. 181కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు. డోర్నకల్ నియోజకవర్గంలో 108 రహదారులకు రూ.155.39 కోట్లు, రూ.1,35 కోట్లతో పెద్దతండా-చెక్ డ్యాం వరకు రోడ్డు పనులు, రూ.8 కోట్లతో మన్య తండా హై లెవెల్ బ్రిడ్జి పనులు, పెద్దతండా -మొగిలిచర్ల వరకు కిలోమీటర్ పరిధిలో రూ.6కోట్లతో సైడ్ డ్రెయిన్, సెంట్రల్ లైటింగ్‌ను, రూ.35లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం, రూ.36లక్షలతో మూడు అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు, రూ.10లక్షలతో కాంపౌండ్ వాల్స్, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు మంత్రి సత్యవతి రాథోడ్ శంకుస్థాపన చేశారు. అనంతరం పెద్దతండా పాఠశాలలో ఏర్పాటు చేసిన బతుకమ్మ చీరెల పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన సంక్షేమశాఖ నుంచి అభివృద్ధి కార్యక్రమాలకు రూ.6వేల కోట్లను ఖర్చు చేశామని, సీఎం కేసీఆర్ అనుమతితో అందులో రూ.450 కోట్లు మహబూబాబాద్ జిల్లాకు కేటాయించినట్లు పేర్కొన్నారు. వీటిలో రూ.150 కోట్లు తాను పుట్టిన ప్రాంతానికి కేటాయించినట్లు మంత్రి తెలిపారు.

### భావోద్వేగానికి గురై కంటతడి పెట్టిన మంత్రి

'తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే.. రాజకీయ జన్మనిచ్చింది సీఎం కేసీఆర్ అని, పెద్దతండాలో పుట్టిన నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చిన కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటా' అని మంత్రి అన్నారు. ఈరోజు తన జీవితంలో పండుగ రోజని, రాష్ట్రానికి మంత్రిగా ఉండడం, అభివృద్ధికి వేలకోట్ల రూపాయలు కేటాయించడం ఒక ఎత్తు అయితే, పుట్టిన ఈ ప్రాంత అభివృద్ధికి నిధులు కేటాయించడం మరొక ఎత్తు అన్నారు. పెద్దతండా అభివృద్ధి కోసం కృషి చేస్తున్న సర్పంచ్ వనజా శ్రీరామ్‌ను అభినందించారు. 'గతేడాది తల్లిదండ్రులను కోల్పోయాను. ఈప్రాంత అభివృద్ధి నా బిడ్డ చేసింది' అని సంతోషపడే మొదటి వ్యక్తులు నా తల్లిదండ్రులు' వారు ఈ రోజు లేకపోవడం బాధాకరం' అంటూ భావోద్వేగానికి లోనై కండతడి పెట్టుకున్నారు. తన తండ్రి లింగ్యానాయక్ ప్రతిరోజూ రోడ్ల గురించి గుర్తుచేసేవాడని.. ఆయన కోరిక ఈ రోజు నెరవేరిందన్నారు. తండా అభివృద్ధి చెందాలని ప్రతిరోజు నా తల్లిదండ్రులు ఆరాటపడేవారన్నారు. పెద్దతండా నుంచి నర్సతండా వైపు మా భూములన్నీ ఉన్నాయని, మున్నేరు వాగులో మా నాన్న సొంత తమ్ముడు గుగులోత్ దేవా రోడ్డు లేక నీటి ప్రవాహంలో గల్లంతయ్యాడంటూ పాత రోజులను గుర్తుచేసుకున్నారు. అలాగే పొలం పనులకు వెళ్లిన సమయంలో ఏరు వస్తే తగ్గేవరకు అటువైపే ఉండేవారన్నారు. నాటి నుంచి మానాన్న లింగ్యానాయక్ చివరి రోజుల వరకు 'బిడ్డా.. రోడ్లు తీసుకురావాలి.. మనోళ్లు బాగా ఇబ్బంది పడుతున్నారని' గుర్తుచేసేవారన్నారు. పెద్దతండా అభివృద్ధి చెందే సమయానికి వారిద్దరూ లేరన్నారు. సీఎం కేసీఆర్ దయతో మా నాన్న కోరికను నెరవేర్చానని గుర్తుచేసుకుంటూ సభావేదికపైనే బోరున విలపించారు. గార్ల మండలం రాంపురం వాగుపై రూ.15 కోట్లతో బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నామని, నిధులు సరిపోకపోతే అదనంగా కేటాయిస్తామన్నారు. సీఎం కేసీఆర్ వల్ల ఈరోజు నేను మంత్రిగా, రాష్ట్ర ఎమ్మెల్యేలకు నా శాఖ నుంచి రూ.వేల కోట్లు ఇచ్చే అవకాశం వచ్చిందనారు. ఈ ఏడాది కోటి మంది ఆడబిడ్డలకు బతుకమ్మ చీరెలు అందించనున్నట్లు తెలిపారు. అలాగే యువతకు క్రికెట్ కిట్లు అందజేశారు. యువత చేతుల్లోనే దేశభవిష్యత్ ఉందని, నిరుద్యోగ సమస్య రూపుమాపడమే బీఆర్ఎస్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ మోహన్‌నాయక్, జోగురామ్ నాయక్, ఆర్అండ్‌బీ ఈఈ తానేశ్వర్, ట్రైబల్ వెల్ఫేర్ హేమలత, ఎంపీడీవో సరస్వతి, తహసీల్దార్ సునీల్‌రెడ్డి, పీఆర్‌డీఈ మహేశ్, ఏఈ శ్రీనివాస్, పార్టీ నాయకులు గుగులోత్ కిషన్‌నాయక్, శ్రీరామ్‌నాయక్, కొంపల్లి శ్రీధర్‌రెడ్డి, నూకల శ్రీరంగారెడ్డి, కాంట్రాక్టర్ వెంకన్న, అర్చకుడు వెంకటేశ్వర్లు, రాందాస్, మోహన్, బీ శ్రీను, జీ హరిప్రసాద్, జీవన్, కిశోర్‌వర్మ, జీ నెహ్రూ, అనిల్‌రెడ్డి, సోమనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి పల్లెకూ మిషన్ భగీరథ నీరు అందించాలి

- *సంక్షేమ పథకాల పనితీరుపై అవగాహన కల్పించాలి*
- *మండల సభలో ఎమ్మెల్యే రెడ్యానాయక్*



మండల సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

చిన్నగూడూరు, అక్టోబర్ 7: ప్రతి తండా, పల్లెకూ నిత్యం మిషన్ భగీరథ నీరందేలా అధికారులు చూడాలని డోర్నకల్ ఎమ్మెల్యే రెడ్యానాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ వల్లూరి పద్మా వెంకటరెడ్డి అధ్యక్షతన నిర్వహించి మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే ముఖ్య అతితిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజాప్రతినిధులు గ్రామాల్లో అవగాహన కల్పించాలన్నారు. సంబంధిత అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉంటూ, ప్రజలకు ఎలాంటి సమస్య తలెత్తినా వెంటనే పరిష్కరించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల పనితీరు బట్టే వారికి గుర్తింపు ఉంటుందన్నారు. జడ్పీటీసీ మూల సునీతా మురళీధర్‌రెడ్డి, రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ మంగపతిరావు, ఎంపీడీవో శ్యాంసుందర్ అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న భాస్కర్‌రావు

## ఆత్మ కమిటీ వైస్‌చైర్మన్‌గా భాస్కర్‌రావు

గార్ల, అక్టోబర్ 7: ఆత్మ కమిటీ జిల్లా వైస్ చైర్మన్‌గా మందనపు భాస్కర్‌రావు శనివారం నియమితులయ్యారు. ఇల్లందు ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ చేతుల మీదగా నియామకపత్రం అందుకున్నాడు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగావత్ లక్ష్మణ్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి లింగాల ఉమేశ్, యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు సూత్రపు రాజుయాదవ్ పాల్గొన్నారు.

## వెంకన్నకు ఎమ్మెల్యే పరామర్శ

గూడూరు, అక్టోబర్7: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చీదురు వెంకన్నను ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ శనివారం పరామర్శించారు. ప్రమాదం తీరును తెలుసుకొని ధైర్యం చెప్పి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.



వెంకన్నను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకర్‌నాయక్

## 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక పట్టివేత

డోర్నకల్, అక్టోబర్ 7: పది క్వింటాళ్ల నల్లబెల్లం, 50 కిలోల పటికను డోర్నకల్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ఎస్సై సంతోష్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుక్కోయలపాడు గ్రామంలో పెట్రోలింగ్ చేస్తుండగా ప్రభుత్వ నిషేధిత నల్లబెల్లం, పటికను ఆటోలో తరలిస్తుండగా ప్రభుత్వ పాఠశాల వద్ద పట్టుకునారు. తనిఖీ చేసి 10 క్వింటాళ్ల నల్లబెల్లం, 50కిలోల పటిక, ఆటోను స్వాధీనం చేసుకొని, పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. డ్రైవర్ మహేశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, తిరుమలాయ పాలెం మండలం కుమ్మరితండాకు చెందిన బోడ బాబురావు, సీరోలు మండలం కోర్లకుంట తండాకు చెందిన బానోత్ వెంకన్న నల్లబెల్లం వ్యాపారం చేస్తున్నట్లు వెల్లడించారు. ఆటో డ్రైవర్ మహేశ్ పట్టుబడగా, బోడ బాబురావు, బానోత్ వెంకన్న పరారీలో ఉన్నట్లు తెలిపారు.

## అనారోగ్యంతో సీహెచ్‌వో మృతి



ఇందిరా (ఫైల్)

డోర్నకల్, అక్టోబర్ 7: అనారోగ్యంతో సీహెచ్‌వో ఇందిరా మృతి చెందిన ఘటన డోర్నకల్‌లో శనివారం జరిగింది. డోర్నకల్ పీహెచ్‌సీలో డిప్యూటేషన్‌పై సీహెచ్‌వో విధులు నిర్వర్తిస్తున్న మాడేపాటి ఇందిరాకు షుగర్ లెవల్ పడిపోవడంతో కుటుంబ సభ్యులు 108 వాహనంలో పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇందిరా మృతితో వైద్య సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు.